www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -347 బుధవారం 25 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## డీలిమిటేషన్‌లో కేంద్రం తీవ్ర వివక్ష

**దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి**

**50 శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదికన చేస్తారు?**

**మన విదేశాంగ విధానం ఆందోళనకరం**

**ట్రంప్‌తో మాట్లాడి యుద్ధాని నివారించండి**

**ప్రధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

**ఢిల్లీలో ఓ మీడియా సంస్థతో పలు విషయాలు వెల్లడి**



**హైదరాబాద్ మార్చి 24, ప్రజావినికిడి**

నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర అన్యాయం జరుగుతున్న నేపథ్యం లో దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఒక ప్రయివేటు టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఎంత అంతరం ఉందో అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. 50 శాతం సీట్ల పెంపు అనేది ఫైనల్ బుల్లెట్ అనీ, ఏ లెక్క ప్రకారం ఆ పెంపు జరుగుతున్నదని ప్రశ్నించారు. ఇప్పటికే కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక బీజేపీ అగ్రనేత వెంకయ్యనాయుడిని ఢిల్లీ నుంచి ఖాళీ చేయించారని గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగైతే జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకెళ్లాలని సూచించారు. మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతున్నదనీ, ఉత్తర, దక్షిణ భారతాలకి మధ్య అంతరాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పెంచుతున్నదని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. తాను ఇంకా ఎనిమిదేండ్లు తెలంగాణ రాజకీయాల్లో ఉంటానని సీఎం చెప్పారు. తాను దేశ రాజకీయాల్లో పనిచేయాలా? వద్దా? అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. మోడీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణాదిని ఐక్యం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. **మిగతా 2లో...**

## మతం మారితే ఎస్సీ, ఎస్టీ హోదా రద్దు..



**సుప్రీంకోర్టు కీలక తీర్పు**

**ఇతర మతాల్లోకి మారిన వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవని స్పష్టీకరణ**

**ఎస్సీ హోదా హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకే పరిమితమని వెల్లడి**

**మత మార్పిడి చేసుకున్న వారు ఇకపై జనరల్ కేటగిరీ కిందకే వస్తారని తీర్పు**

**ఢిలీమార్చి 24, ప్రజావినికిడి**

షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) చెందిన వారు క్రైస్తవం, ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారితే, వారికి రాజ్యాంగబద్ధంగా లభించే కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవని సుప్రీంకోర్టు **మిగతా 2లో...**

## శాంతికే మద్దతు

### ట్రంప్ ఫోన్ చేశారు..: మోదీ ట్వీట్

**శాంతి దిశగా చేపట్టే చర్యలకు భారత్ సహకరిస్తుందని చెప్పాను**

**పశ్చిమాసియా పరిస్థితులపై చర్చ జరిపినట్లు వెల్లడి**

**ఉద్రిక్తతలు తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారత్ మద్దతు ఇస్తుందని ప్రకటన**

**హార్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం ప్రపంచ దేశాలకు అవసరమన్న మోదీ**



**ఢిల్లీమార్చి 24, ప్రజావినికిడి** హర్మూజ్ జలసంధిని తెరిచి సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు ఫోన్ చేసి సంభాషించినట్లు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులపె **మిగతా 2లో...**

## చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

**ఏపీలో ఫిల్మ్ సిటీ, షూటింగ్‌లపై కీలక చర్చలు**



**అమరావతి,మార్చి 24, ప్రజావినికిడి** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు సంజయ్ దత్, తన బృందంతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశం జరిగింది. సంజయ్ దత్‌తో పాటు గౌరవ్ దూబే, కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వంటి ప్రముఖులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, సంజయ్ దత్ కాసేపు ఏకాంతంగా కూడా మాట్లాడుకున్నారు**మిగతా 2లో...**

## సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్..



**సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు**

**పురుషులతో సమానంగా హక్కులు :సుప్రీం**

**వివక్ష చూపడం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్య**

**ఇక మహిళలకూ ప్రమోషన్లు, పూర్తిస్థాయి పెన్షన్**

**కీలక మార్పులకు నాంది పలకనున్న తీర్పు!**

**ఢిల్లీమార్చి 24, ప్రజావినికిడి**


భారత సైన్యంలో పనిచేస్తున్న మహిళా అధికారులకు సంబంధించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. పురుష అధికారులతో సమానంగా మహిళా అధికారులకు కూడా శాశ్వత కమిషన్ (పర్మనెంట్ కమిషన్) పొందే అర్హత ఉందని స్పష్టం చేసింది. శారీరక సామర్థ్యం **మిగతా 2లో...**

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

**పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్ -నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి**

**తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన**

**నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు**



## జల్ జీవన్ మిషన్ 2.0

**జల్ జీవన్ మిషన్ 2.0 అమలుపై కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్న ఏపీ**

**2028 డిసెంబర్ నాటికి ప్రతి ఇంటికి కుళాయి నీరు అందించడమే లక్ష్యం**

**సీఎం చంద్రబాబు చొరవతోనే మిషన్ పొడిగింపు జరిగిందన్న కేంద్రమంత్రి పాటిల్**

**పోలవరం పూర్తికి సహకరించాలని కేంద్రాన్ని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**కుళాయిల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగింత**



**అమరావతి,మార్చి 24, ప్రజావినికిడి**

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ (జేజేఎం) 2.0' అమలు కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 'హర్ ఘర్ జల్' (ప్రతి ఇంటికి కుళాయి నీరు) లక్ష్యాన్ని సాకారం చేసేలా కేంద్రం, ఏపీ మధ్య ఈ ఒప్పందం జరిగింది**మిగతా 2లో...**

## పటేల్ స్ఫూర్తితో ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?

**విగ్రహం పెట్టడమే కాదు ఆయన ఆదర్శాలను పాటించాలి :**

**అసెంబ్లీలో బీజేపీకి ఉప ముఖ్యమంత్రి భట్టి డిమాండ్**

**రూ.197 లక్షల కోట్ల అప్పులో మోడీ చేసిందే రూ.140 లక్షల కోట్లు**

**రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యం**

**ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చిన కేంద్రం**



**హైదరాబాద్‌మార్చి 24, ప్రజావినికిడి**

సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బీజేపీని ప్రశ్నించారు. గుజరాత్‌లో పటేల్ విగ్రహం పెట్టడం సంతోషకరమనీ, దాంతోపా టు ఆయన ఆదర్శాలను కూడా పాటించాలని డిమాండ్ చేశారు. ఆయన విగ్రహం పెడతారు తప్ప ఆయన చేసిన పనులను మాత్రం అమలు చేయబోరని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భట్టి పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చిందన్నారు. **మిగతా 2లో...**

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్



**వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది**

**దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా**

**ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



# జల్ జీవన్ మిషన్ 2.0

మొదటిపేజీ తరువాయి

. ఢిల్లీలోని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు.
ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరుకాగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ ద్వారా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. జల్ జీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, “ప్రతి ఇంటికి సురక్షితమైన, స్థిరమైన తాగునీటిని అందించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇది కూడా ఒకటి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు“ అని అన్నారు. ఇదే సమయంలో, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు.
కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వర్చువల్‌గా మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జేజేఎం 2.0కు అనుమతి ఇచ్చామని తెలిపారు. “ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ప్రధాని మోదీతో సంప్రదించారు. ఈ మిషన్ పొడిగింపు కోసం ఆయన చేసిన ప్రతిపాదనకు ధన్యవాదాలు. మొదటి దశలో 16 కోట్ల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. మిగిలిన 3 కోట్ల ఇళ్లకు సురక్షిత నీటిని అందించాల్సి ఉంది“ అని ఆయన వివరించారు. ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.
ఈ తాజా ఎంఓయూతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో



కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు ఏపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించనుంది. త్వరలోనే ఏపీలోని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి, ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించుకుందామని కేంద్ర మంత్రి పాటిల్ తెలిపారు.
జల్ జీవన్ మిషన్ విజయవంతానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, దీనిని ఏపీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2047 నాటి ‘వికసిత భారత్‘ లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు చేరడం అత్యంత కీలకమని ఆయన నొక్కిచెప్పారు.

# డీలిమిటేషన్‌లో కేంద్రం తీవ్ర వివక్ష

మొదటిపేజీ తరువాయి

దక్షిణాది నుంచి ఎన్నికైన వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మొదటి నుంచీ బీజేపీలో ఉన్నవారిని పక్కకు ఎందుకు పెట్టారని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దక్షిణాది నేతలు రాష్ట్రపతులు అయ్యారని గుర్తుచేశారు. తమ పార్టీది ఇండియా అంతా ఒక్కటే అనే సిద్ధాంతం అని చెప్పారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన 12 ఏండ్లలో దక్షిణాదికి గుర్తింపు ఏదని ప్రశ్నించారు. రాజకీయ వివక్ష కొనసాగించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో, టాప్‌టెన్ పదవుల్లో ఒక్కటి కూడా దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. తమ నేత రాహుల్‌గాంధీ దేశం గురించి ఆలోచిస్తుంటే మోడీ, అమిత్‌షా అందుకు భిన్నంగా ప్రజలపై భారాలు మోపడంపై ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిర్ణయాలు తీసుకున్న తర్వాత అన్ని పార్టీలనూ పిలవటం బీజేపీకి ఆనవాయితీగా మారిందని విమర్శించారు.పెట్టుబడులన్నింటినీ ప్రధాని మోడీ గుజరాత్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ కూడా ఈ దేశంలో భాగమేననే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. మంచి ఎక్కడ ఉన్నా స్వీకరిస్తామన్నారు. గుజరాత్‌లో సబర్మతీ నదిని ప్రక్షాళన చేసిన బీజేపీ హైదరాబాద్‌లో మాత్రం మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ కూడా బీజేపీ బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన నాటికే రాష్ట్రంలో అప్పులు విపరీతంగా పెరిగి ఖజానా ఖాళీ అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, అసెంబ్లీలో దీనిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకులు 11.90 శాతం వడ్డీకి రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పులు తీసుకున్నారని గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్ నచ్చితే నజరానా, లేదంటే జరిమానా అనే విధంగా ప్రజల పట్ల వ్యవహరించారని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు వ్యక్తిగతంగా సమస్యలేమీ లేవనీ, ఆయన తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత సమర్థవంతమైన ప్రతిపక్ష నాయకుని పాత్రని పోషించాలని ఆకాంక్షించారు. తమకు 2034 వరకు ప్రజలు అవకాశం ఇస్తారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భారత విదేశాంగ విధానం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. మన చుట్టూ ఉన్న ఏ ఒక్క దేశంతో కూడా భారత్‌కు సత్సంబంధాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి విద్యార్థులను తీసుకొచ్చినట్టే ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధాన్ని ఆపి చమురును తీసుకురావొచ్చుగదా అంటూ మోడీని ఎద్దేవా చేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశ ప్రధానిగా మోడీకి అండగా ఉంటామన్నారు. అయితే, ఆయన యాక్షన్ ప్లాన్ ఏంటో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌నకు భారత ప్రధానిగా మోడీ ఫోన్ చేసి ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు.పార్టీకి ఉపయోగపడేలా మలుచుకోవాలని సూచించారు. ప్రతి నెల 3 లేదా 4వ వారంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అందరితో సమావేశమవుతానని చెప్పారు. వచ్చే నెల తొలి వారంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈ సమావేశంలో రాజకీయంగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పారు.

# పటేల్ స్ఫూర్తితో ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?

మొదటిపేజీ తరువాయి

ఇది పేద ప్రజలను చీటింగ్ చేయడం కాదా?అని ప్రశ్నించారు.గాంధీని భౌతికంగా బతకనీయలేదనీ, ఆయన పేరు కూడా లేకుండా చేశారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించా లని డిమాండ్ చేశారు. 1950 నుంచి 2014 వరకు 13 మంది ప్రధాన మంత్రులు రూ.56.66 లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. 2014 నుంచి ఈ 12 ఏండ్లలో ప్రధాని మోడీ రూ.140 లక్షల కోట్ల అప్పు తెచ్చారని చెప్పారు. అంటే ఏడాదికి సగటున రూ.11 లక్షల కోట్లు అప్పు చేశారని వివరించారు. దీంతో భారత్ అప్పు ప్రస్తుతం రూ.197 లక్షల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వెళ్తేనే కేంద్రం వద్ద నిధులుంటాయని అన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి రూపాయి వెళ్తే తిరిగి 30 పైసలు మాత్రమే వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అందరం కలిసి కేంద్రంపై పోరాడాలన్నారు. రూపాయిలో కర్నాటకకు 15 పైసలు, ఏపీకి 62 పైసలు, తమిళనాడుకు 26 పైసలు, కేరళకు 60 పైసలు వస్తున్నాయని వివరించారు. కానీ బీహార్‌కు రూ.6.69 పైసలు, ఉత్తరప్రదేశ్‌కు రూ.1.96 పైసలు, మధ్యప్రదేశ్‌కు రూ.1.87 పైసలు, రాజస్థాన్‌కు రూ.1.19 పైసలు వెళుతున్నాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ ఏం పాపం చేశాయని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కేంద్రానికి రూపాయి కడితే రూపాయి తిరిగి ఇచ్చేలా ఒత్తిడి తేవాలని చెప్పారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా మోడీ ప్రకటించిన వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని మోడీ ప్రకటించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, అవమానాలు చేసినా క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలతో తెలంగాణ అభివృద్ధి ఆగేది లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రాజీవ్ యువ వికాసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రస్తుతం నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక నుంచి రూ.వెయ్యి కోట్లు చెల్లిస్తామని చెప్పారు. మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.లక్ష కోట్లు ఇస్తామన్నారు. విద్యుత్ సబ్సిడీలు ఎత్తేయాలనీ, విద్యుత్ ఉత్పత్తికి ఎంత ఖర్చయితే అంత వసూలు చేయాలనీ, విద్యుత్ రేట్లు పెంచకుంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాలు మోడీ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ సబ్సిడీలను ఎత్తేయబోమనీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ పరిపాలన లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. అసెంబ్లీ రికార్డులను తిరగేస్తే పదేండ్లుగా ప్రతిపక్షంలో కూర్చున్న తమకు జరిగిన అవమానాలేంటో తెలుస్తుందన్నారు.ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు సరిగా మైకు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రతిపక్ష సభ్యులుగా తమను గౌరవించకున్నా అర్ధరాత్రి 2 గంటల వరకు ఓపికగా విన్నామే తప్ప వెల్‌లోకి వెళ్లడంగానీ, వాకౌట్ చేయడం గానీ చేయలేదని చెప్పారు. సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ క్లారిఫికేషన్ ఇస్తామన్నా వినే ఓపిక లేకుండా బీఆర్ఎస్ సభ్యులు వెళ్లిపోయారనీ, ప్రజాస్వామ్యంపై వారికున్న గౌరవమిదని విమర్శించారు. బడ్జెట్ కాగితాలను చించి చెవిలో పెట్టుకుని వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం అగాధంలోకి వెళ్లొద్దని దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.1.20 కోట్ల ప్రమాద బీమా కల్పించామని తెలిపారు. బిడ్డలు ఖాళీ కడుపుతో బడికి పోవద్దన్న ఆలోచనతో అల్పాహారం ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్ పిల్లలకు మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రమాద బీమా కల్పించబోతున్నామన్నారు. ఈ మంచి పథకాలు బీఆర్ఎస్ సభ్యులకు కనిపించడం లేదా? వారికి ఇవి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎల్పీ నేత సభకు ఎందుకు రావడంలేదని నిలదీశారు. సమస్త తెలంగాణ ప్రజల కోసం, వారి జీవితాల్లో మార్పు కోసం సభ ఉందన్నారు. అలవికాని హామీలిచ్చారని హరీశ్‌రావు అంటున్నారనీ, వాళ్లలాగా అలవికాని హామీలు మేం ఇవ్వలేదని చెప్పారు. అలా ఇస్తే బడ్జెట్ రూ.5 లక్షల కోట్లపైగా పెట్టాల్సి ఉండేదని అన్నారు. రైతులు, ప్రజా, మహిళా సంక్షేమ కోసం రూ.50 వేల కోట్లు కేటాయించామని వివరించారు. రైతు భరోసా కోసం రూ.18 వేల కోట్లు ఖర్చుచేశామనీ, తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు వేసిన చరిత్ర తమదని గర్వంగా చెప్పారు. రైతు భరోసా స్కీమ్‌ను ఎన్నికల స్కీమ్‌గా మార్చుకున్నది బీఆర్ఎస్ అని విమర్శించారు. హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగు రోడ్డును బీఆర్ఎస్ సర్కారు ఎన్నికల ముందు కుదవపెట్టింది వాస్తవం కాదా? వచ్చిన డబ్బులను రైతు బంధు పేరిట రైతుల ఖాతాల్లో జమచేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వరి కాకుండా ఇతర పంటలు ఎవరైనా సాగు చేస్తే వారిని ప్రోత్సహించాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం ఉందన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్ అని చెప్పారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు. అనంతరం ఉభయసభలు బుధవారం ఉదయం పది గంటలకు వాయిదా పడ్డాయి.

# మతం మారితే ఎస్సీ, ఎస్టీ హోదా రద్దు..

మొదటిపేజీ తరువాయి

మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. మత మార్పిడి తర్వాత కూడా పాత కుల హోదాను కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది.రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ హోదా అనేది కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలకు చెందిన వారికే వర్తిస్తుందని ధర్మాసనం గుర్తు చేసింది. చారిత్రకంగా ఎదుర్కొన్న సామాజిక వెనుకబాటుతనం, అంటరానితనం వంటి తీవ్రమైన వివక్ష ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఒక వ్యక్తి వేరే మతంలోకి మారినప్పుడు, అతను ఆ మతంలోని సామాజిక నిర్మాణంలోకి వెళతాడని, పాత కులంతో ముడిపడిన వివక్షకు గురయ్యే అవకాశం ఉండదని కోర్టు అభిప్రాయపడింది.ఈ తీర్పు నేపథ్యంలో, ఇకపై మత మార్పిడి చేసుకున్న ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో జనరల్ కేటగిరీ కిందనే పరిగణించబడతారు. వారికి ప్రత్యేక రిజర్వేషన్ ప్రయోజనాలు లభించవు. చట్ట ప్రకారం మతం మారడం అంటే, ఆ వ్యక్తి తన పూర్వపు కుల మూలాలను వదులుకున్నట్లేనని కోర్టు తేల్చి చెప్పింది.ఈ తీర్పు రిజర్వేషన్ల అమలుపై భవిష్యత్తులో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనివల్ల రిజర్వేషన్ల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని కొందరు భావిస్తుండగా, మతం మారినంత మాత్రాన వ్యక్తుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు రాదని, వారికి రిజర్వేషన్లు కొనసాగించాలనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

# శాంతికే మద్దతు

మొదటిపేజీ తరువాయి

ఉపయోగకరమైన రీతిలో తమ మధ్య చర్చ జరిగిందని తెలిపారు. ఈ అంశంపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు.వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మద్దతు ఇస్తుందని ట్రంప్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, రక్షణ కల్పించడం ప్రపంచ దేశాలకు అత్యవసరమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. శాంతి, సుస్థిరం దిశగా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ అండగా నిలుస్తుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య గత 24 రోజులుగా జరుగుతున్న యుద్ధానికి, ట్రంప్ నిన్న తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాలను బట్టి నిర్ణయం ఉంటుందని అన్నారు. యుద్ధానికి తాత్కాలికంగా విరామం ప్రకటించిన మరుసటి రోజే ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ కాల్ చేయడం గమనార్హం.

# సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్.

మొదటిపేజీ తరువాయి

లేదా ఇతర సామాజిక కారణాలను చూపి వారికి ఈ అవకాశాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని తేల్చి చెప్పింది.ఈ తీర్పుతో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా సైన్యంలో చేరిన మహిళా అధికారులు కూడా పదవీ విరమణ వయసు వరకు సర్వీసులో కొనసాగేందుకు మార్గం సుగమమైంది. దీనివల్ల వారు పురుష సహోద్యోగులతో సమానంగా పదోన్నతులు, పెన్షన్, ఇతర ఆర్థిక ప్రయోజనాలను అందుకుంటారు. సైన్యంలో లింగ వివక్షను రూపుమాపాల్సిన అవసరం ఉందని, మహిళల నైపుణ్యాన్ని, దేశ సేవలో వారి అంకితభావాన్ని గుర్తించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది.ఈ నిర్ణయంపై రక్షణ రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిపాలన నుంచి క్షేత్రస్థాయి విధుల వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారని, ఈ తీర్పు భవిష్యత్తులో మరింత మంది మహిళలు సైన్యంలో చేరేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు భారత రక్షణ దళాల్లో కీలకమైన మార్పులకు నాంది పలుకుతాయని భావిస్తున్నాం

# చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ..

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో సినిమా రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సంజయ్ దత్ ముఖ్యమంత్రికి వివరించారు.
అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ సిటీ నిర్మాణానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. విశాఖపట్నం లాంటి నగరాల్లో బాలీవుడ్ సినిమాల షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సింగిల్ విండో క్లియరెన్స్ విధానంపై సీఎం క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం సినిమా రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలను సంజయ్ దత్ బృందం ఆసక్తిగా అడిగి తెలుసుకుంది. కేవలం నటుడిగానే కాకుండా, చిత్ర నిర్మాణ రంగంలో కూడా అనుభవం ఉన్న సంజయ్ దత్ బృందాన్ని ఏపీలో స్టూడియోలు లేదా పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు.
సినిమా షూటింగ్‌లకు ఏపీని కేంద్రంగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఉన్న అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఫిలిం స్టూడియోలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా ప్రణాళికలు ఉన్నామని సంజయ్ దత్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తద్వారా సినిమా, వినోద రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంజయ్ దత్‌ను కోరారు.

# పునర్విభజనపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

## జనాభా, ప్రాంతం ప్రాతిపదికన పునర్విభజన జరగదు: రాంచందర్‌రావు

హైదరాబాద్‌మార్చి 24, ప్రజావినికిడ



నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)పై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు మండిపడ్డారు. జనాభా, ప్రాంతం ప్రాతిపదికన పునర్విభజన జరగదని, ఈ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. “నియోజకవర్గాల పునర్విభజన అనేది ప్రతీసారి జనగణన తర్వాత జరిగే రాజ్యాంగబద్ధ ప్రక్రియ... జనగణన పూర్తయిన తర్వాత డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, నియోజకవర్గాల పునర్విభజన చేస్తారు. అయితే డీలిమిటేషన్ జనాభా ఆధారంగా మాత్రమే జరుగుతుందని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది... దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని, ఉత్తరాది రాష్ట్రాలకు లాభం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమి చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధం... డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణ రాష్ట్రాల సీట్లు తగ్గే పరిస్థితి లేదు... న్యాయంగా, సమానంగా అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం పెరుగుతుంది...“ అని ఆయన వివరించారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

హైదరాబాద్,మార్చి 24, ప్రజావినికిడి

దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కళ్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్సన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
బుధవారం 25 మార్చి 2026

## విపంచి ఫౌండేషన్ "అక్షర మిత్ర " ఉగాది పురస్కారం
# అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ టి.రమేష్

ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో
ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం -ఉగాది పురస్కారం.



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** విపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారం ను సీనియర్ జర్నలిస్ట్ టి.రమేష్ సోమవారం రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమం లో ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో ప్రముఖుల సమక్షంలో ఉగాది పురస్కారం అందుకున్నారు.
గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలలో కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ ప్రతీ ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ ని విపంచి ఫౌండేషన్ ప్రత్యేక జూరి కమిటీ ఎంపిక చేసింది.పత్రికా రంగంలో టి రమేష్ చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ప్రకటిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం ) కు చెందిన రమేష్ భువనగిరి లోని డిగ్రీ చదువుకున్న సమయం నుండే జర్నలిజం పై ఆసక్తి తో పలు పత్రికలో స్థానిక సమస్యల స్పందిస్తూ సుమారు 30 సంవత్సరాలనుండి సాహిత్య పరిశోధక వ్యాసాలతో తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు సేవలు అందిస్తున్నాడని అన్నారు.చిన్న వయస్సులోనే సాహితీ మాగాణంలో చెరగని ముద్రను వేసుకున్నాడని తెలిపారు. జర్నలిస్ట్ టి.రమేష్ నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారన్నారు.భవిష్యత్ లో మరిన్ని రచనలు చేసి తెలంగాణకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని కాంక్షించారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఛత్ పూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి అయోధ్య నగర్ లో ఛత్ పూజ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా అయోధ్య నగర్ ఛత్ పూజా సేవ సమితి వారి ఆధ్వర్యంలో భక్తి భావంతో జరిగిన ఛత్ పూజా కార్యక్రమం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్,ఉమేష్ సింగ్, ప్రమోద్ సింగ్,అంజయ్య, జాకి,నరేష్, కృపాల్ యాదవ్, రాంబాబు సింగ్, కూన శ్రావణ్ గౌడ్, బాసుపల్లి సందీప్ గౌడ్,మానస్ గౌడ్, అఖిలేష్ సింగ్, గుడ్డు సింగ్,శర్మ జీ,పరక్, గనశాయం,గోరక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వోసీ..ఆపద కాలంలో ఆర్థిక భరోసా..




**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప కు చెందిన కుం వావిలాల పూర్ణిమ తండ్రి వి. వెంకటేశ్వర రెడ్డి (6.00 లక్షలు)తో పాటు ప్రగతినగర్ కు చెందిన రోళ్ళకంటి రాజు తండ్రి రోడ్ల కంటి దేవదాసు (2.00 లక్షలు)లకు నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు పరుష సత్యనారాయణ యాదవ్ ల చేతుల మీదుగా ఎల్వోసి పత్రాలను అందజేశారు.

## 'జ్యాన' నుండి 'జ్యాన ఝా'గా పేరు మార్పు

**ప్రజావినికిడి, (శంషాబాద్):**
విల్లా నెం.110, కాలనీ, సిద్ధాంతి గ్రామం సమీపంలో, శంషాబాద్, తెలంగాణ 501218 చిరునామాలో నివసిస్తున్న మేము, జితేంద్ర కుమార్ ఝా మరియు వినిత పాఠక్,మా పిల్లలు జ్యాన, నక్షత్రల తల్లిదండ్రులుగా, మా మైనర్ కుమార్తె పేరును 'జ్యాన' నుండి 'జ్యాన ఝా'గా మార్చినట్లు ఇందుమూలంగా ప్రకటిస్తున్నాము. ఇకపై, మా కుమార్తె అన్ని ప్రయోజనాల కోసం మరియు అన్ని అధికారిక రికార్డులలో 'జ్యాన ఝా' అనే పేరుతోనే పిలవబడాలి.

# స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం..





ప్రజావినికిడి,(హైదరాబాద్):
ఉమ్మడి నాగ భూషణం రెడ్డి, సరళా దేవి ఆర్థిక సహకారంతో,వారి కుమార్తె,ఉమ్మడి నాగ శృతి పుట్టినరోజు సందర్భంగా, సోమవారం రాత్రి, హైదరాబాద్ ఎల్బీనగర్,అలాగే వనస్థలిపురం నందు,స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మానసిక వికలాంగులకు అదేవిదంగా వృద్ధులకు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ట్రస్ట్ ప్రతినిధులు, శ్రీ బి సి హెచ్. నరసింహుడు,శ్రీ చెన్నకేశవుల ప్రసాద్ మాట్లాడుతూ,గత నాలుగు సంవత్సరాలుగా, తమ ట్రస్ట్,ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, అందరి ఆదరాభిమానాలను చూరగొంటుందన్నారు. మున్ముందు ఎవరైనా, జన్మదినోత్సవాలు, వివాహ వార్షికోత్సవాలు, లేదా ఆయా వ్యక్తుల జ్ఞాపకార్థం, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు తమను 8522907804 మరియు 9441845957 నెంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు. ఇప్పటివరకు తాము నిర్వహించుకున్న పుట్టినరోజులలో, ఈ పుట్టినరోజు, తమకు ఎంతో ప్రత్యేకమైనదని, జన్మదినోత్సవం జరుపుకున్న,నాగ శృతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తమకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో, ఉమ్మడి నాగభూషణం రెడ్డి, సరళాదేవి పాల్గొన్నారు.

# ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న అధికారులు

**1/59 1/70 చట్టాలకు విరుద్ధంగా నాన్ ట్రైబుల్ అక్రమ పట్టాలు.. -బడా బాబుల చేతివాటానికి అధికారుల దాసోహం..**

**అక్రమ పట్టా పాస్ బుక్కులు రద్దు చేయాలి.. -గొండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్..**

**ప్రజావినికిడి,(వాజేడు)**
భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలులో పొందుపరిచిన చట్టాలను రెవిన్యూ అధికారులు తూట్లు పొడుస్తున్నారని,గొండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ ఆరోపించారు. మంగళవారం వాజేడు తాసిల్దార్ కి ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు గిరిజనేతరులు అక్రమ పట్టాలు పొందారని వాటిని రద్దు చేయాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం సంఘా నాయకులతో సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది.
ఆ సమావేశంలో ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ మాట్లాడుతూ,
షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఎలాంటి భూబదలాయింపులు చెల్లవని 1/59,1/70 చట్టాలు స్పష్టంగా చెప్తున్నాయని అన్నారు.ఈ చట్టలు లేకపోతే ఆదివాసి ప్రజల ఉనికి ప్రశ్నార్థ కంగా మారుతుందని,1/70 చట్టం రాజ్యాంగ బద్ధమైన అని సుప్రీంకోర్టు 1988లో స్పష్టం చేసిందని పేర్కొన్నరు. అయినప్పటికీ గిరిజన నేతలు భూస్వాములు ప్రభుత్వాలను అధికారులను లొంగ తీసుకొని 1070




చట్టాన్ని రద్దు చేయించేందుకు విఫలయత్నం చేస్తూనే ఉన్నారని హేతువు పలికారు. అధికారులు బడా బాబుల చేతివాటానికి అలవాటు పడి అక్రమ పట్టాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వాజేడు మండలం ఏడుచర్లపల్లి (జెడ్)లో సర్వేనెంబర్ 91 లో 8 ఎకరాలు ముత్తారం (జి) సర్వే నెంబర్ 15/2 లో 11 ఎకరాలు,15/1 లో 1.30 ఎకరాల భూములు గిరిజనేతర్లకి పట్టా పాస్ బుక్ ఎలా మంజూరు చేస్తారని అధికారులని ఆయన సూటిగా ప్రశ్నించారు.జిల్లా అధికారులు పూర్తి పరిశీలన చేసి,అక్రమ పట్టాలు మంజూరు చేసిన అధికారులని వెంటనే సస్పెండ్ చేయాలని ఉన్నత అధికారులని కోరారు.ఏవైతే అక్రమ పట్టాలు మంజూరు చేశారో వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ సంఘ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని అధికారుల హెచ్చరించారు.
మునేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల జోలికొస్తే ఊచలు లెక్కపెట్టాల్సిందే.. జాగ్రత్త!

**నెల రోజుల్లో 181 మంది పోకిరీల అరెస్ట్: మల్కాజిగిరి డీసీపీ ఉషారాణి హెచ్చరిక..**

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
ఆడబిడ్డల రక్షణే ధ్యేయంగా షీ టీమ్స్ (షీ టీమ్స్) ఉక్కుపాదం మోపుతున్నాయి. మహిళలు నిర్భయంగా తిరిగే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ విభాగం అలుపెరగని నిఘా కొనసాగిస్తోంది. గడిచిన నెల రోజుల్లో (ఫిబ్రవరి 16 నుండి మార్చి 15 వరకు) షీ టీమ్స్ నిర్వహించిన దాడులు, తీసుకున్న చర్యల వివరాలను డీసీపీ టి.ఉషారాణి మంగళవారం వెల్లడించారు. వేధింపులకు పాల్పడితే ఎంతటి వారినైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు.

**ముసుగు వీడిన మృగాళ్లు: గణాంకాలు ఇవే..**
బస్టాండ్లు, మెట్రో స్టేషన్లు, విద్యాసంస్థలే లక్ష్యంగా మఫ్టీలో ఉన్న షీ టీమ్స్ సభ్యులు పోకిరీల ఆటకట్టించారు. గత నెల రోజుల్లో నమోదైన గణాంకాలు పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది:
మొత్తం అరెస్టులు: 181 మంది (వీరిలో 148 మంది మేజర్లు కాగా, 33 మంది మైనర్లు ఉండటం గమనార్హం).
అందిన ఫిర్యాదులు: 223.
వేధింపుల రకాలు: ఫోన్ కాల్స్ ద్వారా: 57
సోషల్ మీడియా వేదికగా: 53
ప్రత్యక్షంగా/శారీరక వేధింపులు: 113
నమోదైన ఫిర్యాదుల్లో తీవ్రతను బట్టి 8 క్రిమినల్ కేసులు, 57 పెట్టీ కేసులు నమోదు చేయగా.. మిగిలిన 122 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

**నమ్మించి మోసం.. వేధింపుల పర్వం:**
షీ టీమ్స్ చేధించిన కొన్ని కీలక కేసుల వివరాలను డీసీపీ వివరించారు:
**పెళ్లి పేరుతో వంచన:** తోటి ఉద్యోగినిని ప్రేమ పేరుతో నమ్మించిన ఓ ప్రబుద్ధుడు, రహస్యంగా పెళ్లి చేసుకుని ఆమెను రెండుసార్లు గర్భస్రావానికి గురిచేశాడు.



అంతటితో ఆగక బాధితురాలి నగలు,నగదుతో పరారయ్యాడు.షీ టీమ్స్ రంగంలోకి దిగి అతడిని కటకటాల వెనక్కి నెట్టాయి.

**విద్యార్థినికి బెదిరింపులు:**
పాత పరిచయంతో ఓ విద్యార్థినిని కళాశాల వద్ద వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. ఇంటిని ఖాళీ చేయించినా వదలకుండా, సోషల్ మీడియాలో ఫోటోలు పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
యజమాని వక్రీకృత బుద్ధి: ఆఫీసులో మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అర్ధరాత్రి ఫోన్లలో వేధిస్తున్న ఒక ప్రైవేట్ కంపెనీ యజమానిని షీ టీమ్ అరెస్ట్ చేసింది.

**మెట్రోలోనూ నిఘా.. అవగాహనతో చైతన్యం**
మహిళల కోసం కేటాయించిన మెట్రో కోచ్‌లలో ప్రయాణిస్తున్న 6 గురు పురుషులకు జరిమానా విధించారు.కేవలం అరెస్టులే కాకుండా, సమాజంలో మార్పు కోసం షీ టీమ్స్ గత నెలలో 97 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 14,715 మందికి చట్టాలపై అవగాహన కల్పించాయి.

**భయం వద్దు.. ఫిర్యాదు చేయండి!**
"మహిళలు ఎక్కడ ఉన్నా, ఏ సమయంలో ఉన్నా భయపడాల్సిన అవసరం లేదు. వేధింపులు ఎదురైతే వెంటనే మల్కాజిగిరి షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712662111 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించండి.మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

## డ్రగ్స్ పై అవగాహన సదస్సు..



**ప్రజావినికిడి,(నాగోల్ ):**
మంగళవారం రోజూ నాగోల్ డివిజన్ లోని సాయి నగర్ కాలనీ నందు బాల రక్షా భారత్ సంస్థ చైల్డ్ రైట్ ఎన్జీవోస్ ఆర్గనైజర్ శంకరి రమేష్ ఆదర్వర్యం లో వీధి బాలలకు డ్రగ్ అవగాహన సదస్సు,పిల్లల పై లైంగిక దాడులు,అదేవిదంగా విద్య ఉద్యోగాల గురించి..పిల్లల పెంపకం లొ తల్లి దండ్రుల భాద్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ, ఎస్సై శివ నాగ ప్రసాద్ ఎస్ ఐ ఉమా కాలనీ పెద్దలు శైదా బేగం విజయం లక్ష్మి,పాషా మొదలగు వారు పాల్గొన్నారు.

## 4473 ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదల

### హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గౌతం

**హైదరాబాదమార్చి 24, ప్రజావినికిడి :** ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సకాలంలో బిల్లుల విడుదలకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా 4473 మంది కి రూ.48.79 కోట్లను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం తెలిపారు. ప్రతివారం ఇండ్ల నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు బిల్లులను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. గత వారానికి సంబంధించి రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసిన 1969 మంది లబ్దిదారులకు రూ.17.23 కోట్లు, స్లాబు పూర్తి చేసిన 2504 మందికి రూ.31.56 కోట్లు విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లక్ష ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ఆ దిశలో ఫలితాలు సాధిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇంతవరకు లబ్దిదారులకు రూ.5376.22 కోట్లను విడుదల చేసినట్లు ఎండి శ్రీ గౌతం వివరించారు. ఇంటి నిర్మాణపు పురోగతిని బట్టి విడతల వారీగా లబ్దిదారులకు రూ.5 లక్షలను అంద చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంతవరకు బేస్ మెంట్ నిర్మాణం పూర్తి అయిన వాటికి రూ. 2125.98 కోట్లు, గోడలు పూర్తి అయి రూఫ్ లెవల్ వరకు వచ్చిన ఇండ్లకు రూ.1518.51 కోట్లు, స్లాబ్ పూర్తి అయిన వాటికి రూ.1731.73 కోట్లు విడుదల చేశామని ఆయన తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 2.65 లక్షల ఇండ్ల పనులు ప్రారంభంగా కాగా, వాటిలో ఇంతవరకు 1,13,365 ఇండ్ల స్లాబు పూర్తి అయ్యిందని, 34,552 ఇండ్లు రూఫ్ లెవల్ (గోడల నిర్మాణం పూర్తి) దశలో ఉన్నాయని, మరో 61 వేల ఇండ్ల బేస్ మెంట్ నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఆయన వివరించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్,మార్చి 24, ప్రజావినికిడి :** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## మహనీయుల ఉత్సవాల చైర్మన్ గా ఎంబీఎస్సీ కులాలకు ఇవ్వాలి



**ప్రజావినికిడి, (ఆబిడ్స్):** అంబేద్కర్, జగ్జీవన్ రాం మహనీయులు జయంతి ఉత్సవాల చైర్మన్ 57 ఎంబీఎస్సీ కులాలకు ఇవ్వాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఏటా మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ గా మాల, మాదిగ కులస్తులకే ఇస్తూ అదికూడా ఒకటి రెండు సంఘాలకే ఇస్తున్నారని ఆరోపించారు. మిగతా 57 దళిత ఉపకులాలను విస్మరిస్తూ అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత కూడా ఉప కులాలకు సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. అధికారికంగా నిర్వహించే మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ గా ఉప కులాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉత్సవాలు తూతు మంత్రంగా నిర్వహించకుండా ఆ ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎస్సీ శాఖ మంత్రి లు హాజరై గౌరప్రదంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎంబీసీ కులాల నేతలు సానథన్,రాయల లక్ష్మి నరసయ్య, తాలుక రాజేందర్, బైండ్ల దేవేందర్, నాగభూషణం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగాన్ని చేర్చాలి..

### రాజ్యాంగం అంజన్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్



**ప్రజావినికిడి(కుత్బుల్లాపూర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ పై గత 25 రోజుల నుండి తెలంగాణ 33 జిల్లాలలో తిరుగుతూ 30 జిల్లాలల్లో సంపూర్ణంగా ప్రజలను చైతన్య పరుస్తూ ఆయా జిల్లా మెజిస్ట్రేట్ అయినటువంటి కలెక్టర్ కి మెమొరండాలు ఇచ్చుకుంటూ ఆ మెమొరండం ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డికి చేరేటట్లుగా రిక్వెస్ట్ చేయడం జరిగింది ప్రతి కలెక్టర్ కూడా మా మనవిని ఆలకించి వినతి పత్రాలు తీసుకోవడం జరిగింది.ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల ప్రజలను భారత రాజ్యాంగం పట్ల అవగాహన సదస్సులు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటూ 30 ఒకటో జిల్లా అయినా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో కలెక్టర్ కి మెమొరం ఇచ్చి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేసుకుంటూ ఈ రథయాత్ర కొనసాగింది ఈ కార్యక్రమంలో జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపకులు రాజ్యాంగం అంజన్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్ మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏ ఎస్తేరు రాణి సలహాదారులు అలెగ్జాండర్ ప్రభు బాలస్వామి బ్రాహ్మ ఎల్లన్న పాల్గొని మేడ్చల్ జిల్లా రథయాత్ర కార్యక్రమాని జయప్రదం చేశారు.

## ఘనంగా స్వర్గీయ కీ.శే.ఆచార్య జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్)** తెలంగాణ సిద్ధాంతకర్త,ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రదాత, అపర మేధావి, తెలంగాణ జాతిపితగా పేరుగాంచిన స్వర్గీయ కీ.శే.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ (సార్) జ్ఞాపకార్థంగా ప్రగతి నగర్‌లోని అలీప్ సర్కిల్‌లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం పూలమాల అర్పించి గణ నివాళులు సమర్పించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ, తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ద

## ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేసిన మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన నాలుగు లక్షల యాభై వేల(4,50,000) విలువైన చెక్కులను షాపూర్ నగర్ లోని నివాసంలో అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకున్న రాజేష్ కుమార్, లావు సప్న,శ్రీలేఖ, ముద్దుల బాబు, మహమ్మద్ హుస్సేన్,మాధవి, చిన్న స్వామి, విశాలాక్షి కు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎస్) అనేది నిరుపేదలకు ఆర్థిక అవసరాన్ని తీర్చే ఒక గొప్ప కార్యక్రమం అని తెలియజేశారు, నియోజకవర్గం పరిధిలో నిరుపేదలు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నట్లయితే వాటికి సంబంధించిన రసీదులను తమ సిబ్బందికి అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయండి

### దీర్ఘాకాలికంగా పెండింగ్ లో ఉన్న ఏన్.జి.ఓస్.కాలనీ గ్రంథాలయం పనులు రేపటి నుండి ప్రారంభం.ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ప్రజావినికిడి, ( ల్బీనగర్ ):**
ఈ రోజు ఏన్.జి.ఓస్.కాలనీపెద్దలు ఖశ్రీఘట కాలనీవాసులందరు కలిసి లైబ్రరీ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. సందర్భంగా కాలనీవాసులు అందరు గ్రంధాలయం పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే గారిని కోరడం జరిగింది.స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రంధాలయం పనులు తాను ఎప్పుడు ఆపలేదని కొందరు బి.జె.పి.కార్పొరేటర్ల దుందుడుకు చర్యల కారణంగా పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే తెలిపారు.గ్రంధాలయం పనులను నుండి ప్రారంభించాలని అక్కడే ఉన్న గ్రంథలయం ఈ.ఈ.అలాగే డి.ఈ.ను అదేశించడం జరిగింది.రేపటి నుండి గ్రంధాలయం పనులు ప్రారంభం కానుండడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీ పెద్దలందరు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని అలాగే బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ని సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ కాలనీపెద్దలు సోమయాజులు,పంపన్న వెంకటేశ్వర,శివనాగేశ్వర్ రావు,వేముల జైపాల్ రెడ్డి,వర్ధని,శశిధర్ రెడ్డి,ఓంప్రకేష్,భూషణ్,విశ్వనాథం,శ్యాంకుమార్,ఆనంద్ ఎన్జీవోస్ కాలనీపెద్దలు, చుట్టుపక్కల కాలనీపెద్దలు భారస నాయకులు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరీ,యూత్ అధ్యక్షులు మునగాల రాఘవేందర్ రావు,కొంగర మహేష్,నీళ్ల రాజశేఖర్ గౌడ్,నరేందర్ గౌడ్,శ్రీకాంత్ రెడ్డి,అమర్థ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా ఆదేశించాలి..

### రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి..



**ప్రజావినికిడి ,(రంగారెడ్డి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి.

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్ లతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 థీముల తో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్ కు సంబంధించిన మరమ్మత్తులు, భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని, కార్యాలయాల పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ పూర్తి చేయాలని,ఏ ఒక్క శాఖలో కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్లో ఉండకుండా పరిష్కరించాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు.జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ ఫైల్ లు క్లియర్ చేయాలని అన్నారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్లక్ష్య వైఖరితో కాకుండా బాధ్యతతో ప్రతి ఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో సమార్ధవంతగా నిర్వహించి విజయవంతగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు.ప్రతి శాఖ ఈ-ఆఫీస్ నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని,పైపు లీకేజులు లేకుండా చూడాలని,ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపించాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతెన్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు,మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పని చేయాలని అన్నారు.నీటి కొరత ఏర్పడకుండా చేపడుతున్న చర్యలు ప్రజలకు తెలిసేలా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి,డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య,పిడి డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ అధికారులు,ఆర్ అండ్ బి అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు రామరావు,నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, కె.రామవేశ్వరి దేవి, పద్మావతి, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిఒలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భారమొద్దు

**అమరావతి, మార్చి 24, ప్రజావినికిడి**



ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా విద్యుత్ సంస్థల (డిస్కంల) రుణాలను తీర్చేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఇంధన శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో
ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు తగ్గింపుపై రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ సంస్కరణల ద్వారా 2028-29 నాటికి యూనిట్‌పై రూ.1.32 భారాన్ని తగ్గించి, కొనుగోలు ధరను రూ.4.10కి తీసుకురాగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ధరను రూ.4కు తగ్గించేలా చూడాలని సూచించారు. సమర్ధ నిర్వహణ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.339 కోట్లు ఆదా చేశామని అధికారులు తెలపగా, పొదుపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

ఇంధన రంగం గేమ్ ఛేంజర్"ఉమ్మడి రాష్ట్రంలోనే దేశంలో తొలిసారిగా ఎనర్జీ ఆడిటింగ్ వంటి సంస్కరణలు తెచ్చాం. ఇప్పుడు ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. ఇంధన రంగం భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుంది. తక్కువ ఖర్చు, పర్యావరణ హిత విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి," అని చంద్రబాబు అన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను ప్రజలకు, రైతులకు మరింత చేరువ చేయాలని సూచించారు. సోలార్ విద్యుత్‌లో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**ఎనర్జీ యూనివర్సిటీ, ఇంక్యుబేషన్ ఫండ్**

రాష్ట్రంలో ఇంధన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఒక 'ఎనర్జీ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లకు ఆర్థిక చేయూతనిచ్చేలా 'ఇంక్యుబేషన్ ఫండ్' ఏర్పాటు చేయాలని సూచించారు. "మన విద్యుత్ సంస్థలు ఇతర రాష్ట్రాలకు కన్సల్టెన్సీ సేవలు అందించే స్థాయికి ఎదగాలి. ఇప్పటికే ట్రూ అప్ భారాన్ని ప్రజలపై వేయలేదు, పైగా 13 పైసల మేర ట్రూడౌన్ చేశాం. కొనుగోలు భారాన్ని కూడా తగ్గిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో అగ్నిప్రమాదం

## వరుస ప్రమాదాలపై చంద్రబాబు అనుమానం

## దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని ఆదేశం

**అమరావతి,మార్చి 24, ప్రజావినికిడి**



రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్నపోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అమరావతిలో ఇటీవల కూడా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 11న ఎల్ అండ్ టీకి చెందిన ప్లాస్టిక్ పైపులు తగలబడటంతో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. రాజధాని అమరావతిలోని ప్రాంతం రాయపూడిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో మంగళవారం సమీక్ష చేశారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద మెగా సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు రాత్రి దగ్ధమైన ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో తరుచూ అగ్గిప్రమాదాలు జరగడంపై సీఎం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదమా, కుట్రకోణం ఉందా అనే విషయంలో సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మూడు ఘటనల్లో వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన నిర్మాణ సామాగ్రి దగ్ధమైందని తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల టవర్ల సమీపంలో పైపులు కాలిపోయాయి. ఇది ప్రమాదమా...?, కుట్రకోణమా అనే దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల వెలగపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కొందరు ఉద్దేశపూర్వకంగా పైవులకు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అలాగే మెగా సంస్థకు చెందిన పైపులకు కొందరు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

**పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్**

**నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి**

**తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన**

**నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు**



**జగిత్యాల,మార్చి 24, ప్రజావినికిడి** తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళు_న్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారదామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ప్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.' అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఆర్డీటీకి తొలగిన అడ్డంకులు..

## మంత్రి లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మాంచో ఫెర్రర్

**అమరావతి, మార్చి 24, ప్రజావినికిడి**



తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో నిస్వార్థ సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. విదేశీ విరాళాల స్వీకరణపై ఉన్న నిబంధనలను సడలించేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంలో విరాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో, ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్ మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ, ఇది కేవలం ఆర్డీటీ సంస్థ తరఫున చెబుతున్న ధన్యవాదాలు కాదని, లక్షలాది మంది పేద ప్రజలు అందిస్తున్న ఆశీస్సులని అభివర్ణించారు. దీనికి లోకేశ్ బదులిస్తూ.. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆర్డీటీ దశాబ్దాలుగా అందిస్తున్న సేవలతో పోలిస్తే తాను చేసిన సహాయం చాలా చిన్నదని వినమ్రంగా వ్యాఖ్యానించారు.
విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఫీజ=ూా) కింద కేంద్ర ప్రభుత్వం గతంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలకు విదేశాల నుంచి వచ్చే నిధులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల కారణంగా, తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి అండగా నిలుస్తున్న ఆర్డీటీకి కూడా విదేశీ నిధుల ప్రవాహం నిలిచిపోయింది. దీంతో సంస్థ కార్యకలాపాలు కొనసాగించడం కష్టతరంగా మారింది.ఈ సమస్యను ఆర్డీటీ నిర్వాహకులు గతంలోనే మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో, "లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. సంస్థ సేవలు నిరంతరాయంగా కొనసాగేలా పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తాం" అని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ఆయన కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలతో సంప్రదింపులు జరిపి ఈ సున్నితమైన సమస్యకు పరిష్కారం కనుగొన్నారు.
మంత్రి లోకేశ్ చొరవతో ఆర్డీటీకి విదేశీ నిధులు స్వీకరించేందుకు మార్గం సుగమమైంది. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు కూడా వెలువడినట్లు సమాచారం. దీంతో అన్నార్తులు, నిరుపేద విద్యార్థులు, రోగులకు ఆర్డీటీ అందిస్తున్న సేవలు ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగనున్నాయి

# నేటి డిజిటల్ యుగంలోనూ వార్తల ప్రసారంలో ఆకాశవాణి పాత్ర సుస్థిరం

## -ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్

హైదరాబాద్,**మార్చి 24, ప్రజావినికిడి**

వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నాయని, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్, శ్రీ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుం దని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని కవాడీ గూడ సిజిఓ టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ ఓ÷ూ మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెళకువలను పెంపొంది స్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందనీ పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌గా ఆకాశవాణిలో ఖచ్చితత్వం, ధర్మనిష్టను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, వాట్సప్ యూనివర్సిటీ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఖఏః లో ప్రారంభించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం గురించి వివరించారు . ప్రభుత్వ కమ్యూనికేటర్లుగా విలేకరులు క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ, ఆకాశవాణి విశ్వసనీయతకు, సమగ్రతకు, సంపూర్ణతకు మారుపేరు అని చెప్పారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని విశ్వసనీయతను పోగొట్టుకోకుండా ఆకాశవాణి ప్రఖ్యాతిని అలాగే నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ.. 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణి లో వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉర్దూ శ్రోతలను దృష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. పలు అంశాలపై సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు శిక్షణా తరగతులు నిర్వహించారు. 'మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ తయారీ' అనే అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్. దిలీప్ రెడ్డి అవగాహన కల్పించారు. 'సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం' అనే అంశంపై హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ ఆస. కూర్మనాథ్ వివరించారు. 'న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ బదిలీ, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం' అనే అంశంపై ఐ న్యూస్ సీఈఓ, చీఫ్ ఎడిటర్ ఏ కే సాగర్ విశ్లేషించారు. అలాగే, 'ఫాక్ట్ చెక్, సోషల్ మీడియా హ్యాండిల్స్ మెరుగుపరచడానికి సోషల్ మీడియా టెక్నిక్స్' అనే అంశంపై ఫాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మారుతున్న మీడియా పరిస్థితులలో ఆకాశవాణి విలేకరులకు కొత్త దిశానిర్దేశర లభించింది.




# త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

## కొనుగోలుదారు అఫ్ఫిడవిట్ ఇస్తే సరిపోతుంది

## దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76

## శాసన మండలిలో మాత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,మార్చి 24, ప్రజావినికిడి ):** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్ఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మమకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

# సీట్లు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే

**అమరావతిమార్చి 24, ప్రజావినికిడి**

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్ధం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నలనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే



ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37-38కి, అసెంబ్లీ సీట్లు 262-263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్టాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి.


లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

# భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

## 27న కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు

**భద్రాచలం,,మార్చి 24, ప్రజావినికిడి**

భద్రగిరిలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేం దుకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం నిమగ్నమయ్యింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం కూడా ఆదేశించింది. గవర్నర్, సిఎంలకు కూడా ఇప్పటికే ఆహ్వానాలు అందచేశారు. 27న జరిగే సీతారాముల కల్యాణం, 28న జరిగే మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వంహించారు. ఈ వీసీకి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన కార్యాచరణతో పని చేయాలన్నారు. ఇక నవమి రోజున 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రానున్నారని, అదేరోజు ఆయన చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శిలాఫలం ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. ఇక పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ ,



తదిత భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.శిఇప3.తూణభద్రాచలంలో మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీరామనవమి ఏర్పాట్లను కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. 26న ఉదయం 9గంటల వరకు సబ్‌కలెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వీవీఐపీ, వీఐపీలకు బస చేసే అతిథి గృహాలకు నియమితులైన సెక్టారల్ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా గొడవలకు దిగితే పోలీసు సహకారం తీసుకొని సర్దుబాటు చేయాలని, దేవుడి దగ్గర అందరూ సమానమే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

## కుట్రకోణంపై దర్యాప్తు: హోంమంత్రి

**అమరావతిమార్చి 24, ప్రజావినికిడి**



రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం.. అది కూడా ఒకే తరహాలో జరుగుతుండటంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్ధరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని.. ఐదు అగ్నిమాపక శకటాలతో చాలా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.అమరావతిలో ఇటీవల జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించారన్నారు. ఆ రోజు సైతం జరిగిన అగ్నిప్రమాదం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అమరావతి ప్రాంతంలో గత కొద్ది రోజులుగా వర్షం కురిసినందున ఈ తరహా ఘటనలు జరగటానికి అవకాశాలు చాలా స్వల్పమని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ÷రిళిమవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ ఘనంగా జరిగిందని.. దీన్ని చూసి ఓర్వలేక రాజధానిలో పైపులకు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని మంత్రి అనిత సందేహం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఓర్వలేక అరటితోటకు నిప్పు పెట్టిన ఉదాహరణలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ ప్రమాదంపై పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ చేస్తోందని మంత్రి అనిత వివరించారు.

# నగరంలో పెట్రోల్,డీజిల్ కొరత లేదు

## బంకుల వద్ద బారులు తీరవద్దు -సోషల్ మీడియా పుకార్లు నమ్మొద్దు: కమిషనర్

**హైదరాబాద్,,మార్చి 24, ప్రజావినికిడి**



:హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంక్‌ల వద్ద బారులు తీరవద్దని సూచించారు. సోషల్ మీడియా పుకార్లు నమ్మవద్దన్నారు.

# పార్లమెంటులో వైసిపికి 11 వ నంబర్ గది

## మార్చాలని స్పీకర్‌కు వినతి -12 నంబరు కేటాయిస్తూ ఆదేశాలు

**న్యూఢిల్లీ,,మార్చి 24, ప్రజావినికిడి**

ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, '11' అనే సంఖ్యకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధం ఈ ఘటనతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. కొత్త పార్లమెంటు భవనంలో ఆయా పార్టీల బలాబలాలను చూసి స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తుంది. అయితే వైసీపీ ఎంపీలకు కేటాయించిన గది నంబర్ వారిని తీవ్ర కలవరానికి గురిచేసింది. స్పీకర్ కార్యాలయం మొదట వైసీపీకి మొదటి అంతస్తులో 11వ నంబర్ గదిని కేటాయించింది. ఈ నంబర్ చూడగానే వైసీపీ ఎంపీలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు వైసీపీని '11' అంటూ ఎద్దేవా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు పార్లమెంటులో కూడా అదే నంబర్ రావడం ఫ్యాన్ పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. తమకు ఇచ్చిన గది నంబర్ మార్చాలని కోరుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలు హుటాహుటిన స్పీకర్‌ను కలిశారు. 11వ నంబర్



గదిని ఎందుకు వద్దంటున్నారని స్పీకర్ ప్రశ్నించగా.. ఆ నంబర్ తమకు కలిసి రావడం లేదని, ఏపీలో తమ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య కూడా అదే కావడంతో అందరూ హేళన చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతలు వివరించారు. ఆ పార్టీ ఎంపీల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్, వారికి 12వ నంబర్ గదిని కేటాయించారు. దీంతో వైసీపీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రాజకీయాల్లో సంఖ్యాశాస్త్రం సెంటిమెంట్లకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఈ ఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు 151 సీట్లతో రికార్డు సృష్టించిన పార్టీ, ఇప్పుడు '11' అనే అంకెను చూసి భయపడటం రాజకీయ విచిత్రమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఆంధప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి పార్లమెంటు మొదటి అంతస్తులో 9వ నంబర్ గదిని కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోండటంతో, ప్రధానమైన గదుల్లో ఒకటి వారికి దక్కింది.

# ఎపిలో ఉగ్రలింకుల కలకలం

## విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్

**విజయవాడ,,మార్చి 24, ప్రజావినికిడి :** ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్

## తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం
## క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం
## రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్,మార్చి24:** తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రొసీల బహుకరణ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర పక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు. ÷ఖఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే పక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు. ÷-రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ÷ూష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆ÷-లనైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. వరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్ గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిడే మహిళల టోర్నమెంట్‌కు దూరం

## • వైదొలగుతున్నట్లు హంపి పోస్ట్




**విజయవాడ,మార్చి24:** భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిష్టాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. యుద్ధం కారణంగా భద్రత్రపై ఆందోళనగా ఉందని, బాంబుల మోతల మధ్య చెస్ పై శ్రద్ధ పెట్టడం సాధ్యం కాదని వాపోయింది. ఇదివరకే టోర్నీ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హంపి చివరకు టోర్నీని బాయ్ కాట్ చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'చాలా సమయం ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి । వైదొలుగుతున్నా. వ్యక్తిగత భద్రత, సురక్షితంగా ఉండడం కంటే ఏ ఈవెంట్ ముఖ్యమైనది కాదు. భరోసా నిర్వాహకులు కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో నేను సురక్షితంగా ఉంటానని అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధతో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకో వాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను' అని హంపి తన పోస్ట్లో వెల్లడించింది. దుబాయ్లో చిక్కుకొని ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ పోటీలకు బ్యాడ్మింటన్ స్టార్÷వి సింధు దూరంగా ఉండగా.. కోనేరు హంపి సైతం మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. మార్చి 28 నుంచి ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపి పై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్కట్ చేసినందుకు ఆమె భారత కరెన్సీలో రూ. 1.50కోట్లు జరిమానా పడే ఛాన్స్ ఉంది.



# దక్షిణాఫ్రికా పర్యటనకు టీమిండియా మహిళా జట్టు ప్రకటన

త్వరలో దక్షిణాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో భారత మహిళలు 5 మ్యాచ్ల టీ20 సిరీస్ ఆడనున్నారు. ఏప్రిల్ 17న ఈ సిరీస్ ప్రారంభం కానుంది. కాగా.. ఈ సిరీస్లో పాల్గొనే భారత మహిళా జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఇక 15 మంది సభ్యులు గల బృందానికి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వం వహించనుంది. వైస్ కెప్టెన్గా స్మృతి మంధాన వ్యవహరించనుంది. ఆల్‌రౌండర్ అనుష్క శర్మకు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. అలాగే కాష్వీ గౌతమ్ టీ20 అరంగ్రేటానికి సిద్ధమైంది. ఇటీవల ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపికైన వైష్ణవి శర్మ, స్నేహ్ రాణా, జి.కమలినీ, అమన్‌జోత్ కౌర్‌లకు దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు చోటు దక్కలేదు. **దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు టీమిండియా ఉమెన్స్ టీమ్ ఇదే..** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ , రిచా ఘోష్, అరుంధతి రెడ్డి , రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, శ్రేయాంక పాటిల్, కష్వీ గౌతమ్, భారతీ ఫుల్మాలి, ఉమా ఛెత్రి, అనుష్క శర్మ.

# తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ పెద్ద దిక్కు


## • టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గిన తొలి జట్టు ముంబై ఇండియన్స్ ). తొలి ఐదేళ్లలో ఒక్క టైటిల్ కూడా నెగ్గని ముంబై.. 2013లో తొలిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో మరో నాలుగు టైటిల్స్ నెగ్గింది. ఈ ఐదు టైటిల్స్ కూడా రోహిత్ శర్మ కెప్టెన్సీలోనే రావడం విశేషం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ సమీపిస్తున్న తరుణంలో జట్ల బలాబలాలు, ఆటగాళ్ల ప్రదర్శనపై విశ్లేషణలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ముంబై ఇండియన్స్ జట్టు గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముంబై జట్టులో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి దిగ్గజ బ్యాటర్లు ఉన్నప్పటికీ, రాబోయే సీజన్‌లో ఆ జట్టుకు అత్యుత్తమ బ్యాటర్‌గా మరో ప్లేయర్‌ను ఎంపిక చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఐపీఎల్ 2026 అంచనాల గురించి మాట్లాడుతూ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబై ఇండియన్స్ జట్టులో ఎంతోమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారని, కానీ తిలక్ వర్మ ఒక 'కంప్లీట్ ప్యాకేజీ' అని ఆయన కొనియాడారు. "చాలామంది రోహిత్ శర్మ విధ్వంసం గురించి లేదా సూర్యకుమార్ యాదవ్ 360 డిగ్రీల ఆట గురించి మాట్లాడుకుంటారు. కానీ నా దృష్టిలో ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక పరుగులు చేసే ఆటగాడిగా, అత్యంత ప్రభావ వంతమైన బ్యాటర్‌గా తిలక్ వర్మ నిలుస్తాడు" అని అశ్విన్ పేర్కొన్నారు. తిలక్ వర్మ గత కొన్ని సీజన్ల నుండి ముంబై ఇండియన్స్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ జట్టును ఆదుకోవడంలో తిలక్ చూపించే పరిణతి అద్భుతమని అశ్విన్ విశ్లేషించారు. ఐదుసార్లు



ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టులో మిడిల్ ఆర్డర్‌కు తిలక్ వర్మ వెన్నెముకగా మారాడని, అతడి బ్యాటింగ్ శైలి జట్టుకు అవసరమైన సమతుల్యతను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఆటగాళ్లు అనడంలో సందేహం లేదని, అయితే తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నిర్మించే తీరు, అవసరమైనప్పుడు గేర్ మార్చి భారీ షాట్లు ఆడే సామర్థ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెడతాయని అశ్విన్ వివరించారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కో వడంలో తిలక్ వర్మకు ఉన్న పట్టు, మైదానం నలుమూలలా బంతిని తరలించే టెక్నిక్ అతడికి అదనపు బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. 2022లో ముంబై ఇండియన్స్ జట్టులోకి ప్రవేశించినప్పటి నుండి తిలక్ వర్మ వెనక్కి తిరిగి చూడలేదు.

# ఎడ్వర్డ్స్ స్థానంలో డేవిడ్ పేన్



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026కి ముందు కీలక నిర్ణయం తీసుకుంది. గాయంతో ఈ సీజన్ ప్రారంభానికి ముందే తప్పుకున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ స్థానంలో మరో పేసర్‌ను తీసుకుంది. ఎడ్వర్డ్స్ స్థానంలో ఇంగ్లాండ్ సీనియర్ బౌలర్ డేవిడ్ పేన్‌ను తీసుకుంది. ఈ విషయాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 35 ఏళ్ల డేవిడ్‌ను సన్‌రైజర్స్ 1.5 కోట్లకు దక్కించుకుంది. ఇంగ్లాండ్ తరుపున డేవిడ్ కేవలం ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. అయితే.. టీ20 ఫార్మాట్‌లో డేవిడ్‌కి అపారమైన అనుభవం ఉంది. 233 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 8.03 ఎకానమీతో 304 వికెట్లు పడగొట్టాడు. ఇటీవల బిగ్ బాష్ లీగ్‌లోనూ డేవిడ్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఆరు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టి తన జట్టు పెర్త్ స్కార్చర్స్ టైటిల్ అందుకోవడంలో డేవిడ్ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సైతం అందుకున్నాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో 18 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. ఇక ఐపీఎల్ 2026 మార్చి 28న ప్రారంభం కానుంది. కాగా.. ఆరంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.

# ఆటగాళ్లకు రికీ పాంటింగ్ దిశానిర్దేశం



ఐపీఎల్ 2026 వేట మొదలైంది. గత సీజన్‌లో తృటిలో చేజారిన టైటిల్‌ను ఈసారి ఎలాగైనా ముద్దాడాలని పంజాబ్ కింగ్స్కంకణం కట్టుకుంది. ఈ క్రమంలోనే జట్టు కొత్త హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ రంగంలోకి దిగారు. చండీగఢ్ వేదికగా జరుగుతున్న ప్రాక్టీస్ క్యాంప్‌లో చేరిన పాంటింగ్, అడుగు పెట్టడమే ఆలస్యం ఆటగాళ్లకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. నెట్స్‌లో కేవలం బంతులు విసరడం, బ్యాట్ ఊపడం మాత్రమే సరిపోదని, మానసికంగా, శారీరకగా యుద్ధానికి సిద్ధం కావాలని కుండబద్దలు కొట్టారు. మార్చి 31న న్యూ చండీగఢ్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో పంజాబ్ కింగ్స్ తన తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ నేపథ్యంలో రికీ పాంటింగ్ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేశారు. "కేవలం నెట్స్‌లో సమయం గడపడం వల్ల ఎలాంటి ప్రయోజనం అనేది ఉండదు. టెక్నికల్ గా, ఫిజికల్ గా, అంతకంటే ముఖ్యంగా మెంటల్ గా మ్యాచ్‌కి సిద్ధంగా ఉండాలి" అని ఆయన తేల్చి చెప్పారు. ట్రైనింగ్ సెషన్లు అంటే కేవలం అలవాటు కోసం చేసేవి కాదని, మనల్ని మనం ఒక విజేతగా మలచుకునే సమయం అని గుర్తు చేశారు. జట్టులో ఐక్యత ఉంటేనే అద్భుతాలు జరుగుతాయని గతేడాది ప్రదర్శనను ఉదాహరణగా చూపారు. క్రికెట్‌లో తప్పులు చేయడం సహజమని, కానీ పక్కా ప్రణాళికతో ఆడటం ముఖ్యమని పాంటింగ్ ప్లేయర్లకు హితబోధ చేశారు. ఎవరైనా క్యాచ్ వదిలేయవచ్చు లేదా బౌలర్ వైడ్ బాల్ వేయవచ్చు, అంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఒక ఆటగాడు తన గేమ్ ప్లాన్ మీద నమ్మకంతో ఉండి, సరైన ఆలోచనతో ఆడుతున్నప్పుడు పొరపాట్లు జరిగితే అది పెద్ద సమస్య కాదని ఆయన అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్ ఫలితాల మీద ఒత్తిడి పెంచుకోకుండా, ప్రతి రోజూ అనుసరించే పద్ధతి మీద దృష్టి పెడితే సక్సెస్ ఆటోమేటిక్ గా వస్తుందని పాంటింగ్ భరోసా ఇచ్చారు. గత ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ, నిర్ణయాత్మక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) చేతిలో కేవలం 6 పరుగుల తేడాతో ఓడిపోయింది.



# రూ. 15 వేల కోట్లకు అమ్ముడైన రాజస్థాన్ రాయల్స్!

రాజస్థాన్ రాయల్స్ అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్లకు జట్టును కొనుగోలు చేసింది. ఈ క్రమంలో 1 బిలియన్ డాలర్లకు అమ్ముడైన తొలి ఐపీఎల్ జట్టుగా ఆర్‌ఆర్ నిలిచింది. కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎంఎఫ్‌ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థిక మద్దతు లభించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన డీల్. ఈ డీల్‌తో రాజస్థాన్ రాయల్స్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా నిలవనుంది. ఐపీఎల్ 2026 ముగిసిన తరువాత కొత్త యాజమాన్యం బాధ్యతలను స్వీకరించనుంది. గతంలో సంజీవ్ గోయెంకాకు చెందిన ఆర్‌పిఎస్‌జి గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా.. టొరెంట్ గ్రూప్ గుజరాత్ టైటాన్స్‌లో 67 శాతం వాటాను 575 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త అయిన సోమాని ఇప్పటివరకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాను కలిగి ఉన్నారు.


## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷-లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ంఎ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది



## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.




## విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి. హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

## డెతడి గ్లింప్స్.. ఘనీ భాయ్ ఎనర్జీతో ఆకట్టుకున్న ఆశిష్!

దిల్ రాజు.. శిరీష్ కలిసి కొత్తగా డెతడి అనే సినిమా తీసుకొస్తున్నారు. ఈ సినిమాలో యంగ్ హీరో ఆశిష్ నటిస్తున్నారు. ఆయన ఇప్పటికే రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో గుర్తింపు పొందారు. ఈ సినిమాతో ఆదిత్య రావు గంగసాని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కథ హైదరాబాద్ నేపథ్యంలో సాగుతుంది. నగర సంస్కృతి, జీవన శైలి, ఉత్సాహాన్ని ఈ సినిమా చూపించబోతోంది. ఈరోజు ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది చూసిన ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి పెరిగింది. గ్లింప్స్‌లో ప్రధాన పాత్ర ఘనీ భాయ్ (ఘన్ను భాయ్)ను ఒక స్ట్రీట్ డ్రమ్ ఆర్టిస్ట్ గా పరిచయం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో జరిగే పండుగలు, వేడుకల్లో డ్రమ్స్ వాయిస్తూ అందరిని అలరిస్తూ ఉంటాము అని హీరో డైలాగులు చెబుతూ స్టైల్ గా నరుస్తూ కనిపించారు.ఘనీ భాయ్.. నా పేరు.. సుమారు ఏడు కిలోల బరువు ఉన్న డ్రమ్స్ మోసుకుంటూ గంటల పాటు ఆగకుండా ప్రదర్శన ఇస్తూ ఉన్న నా మొహం లో చిరునవ్వు చెరగదు," అంటూ.. హీరో డైలాగులు హైలైట్ గా నిలిచాయి . ఈ పాత్రలో ఆశిష్ చాలా బాగా నటించారు. అతని రఫ్ లుక్, గడ్డం, స్టైల్ పాత్రకు సరిగ్గా సరిపోయాయి. ఆయన బాడీ లాంగ్వేజ్, హైదరాబాద్ స్లాంగ్ మాట్లాడే విధానం సహజంగా అనిపించింది. ఇక చివరిలో బ్యాండ్ వాళ్ళం కదా అన్న గట్టిగా వాయిస్తాము అన్న డైలాగ్ కూడా హైలెట్గా నిలిచింది. ! దర్శకుడు ఆదిత్య రావు గంగసాని కొత్తవాడైనా కథను బాగా చూపించినట్టు ఈ చిన్న గ్లిమ్స్ చూస్తే అర్థమవుతుంది. విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా, ఎనర్జీతో కనిపిస్తున్నాయి. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మరియు దిల్ రాజు ప్రొడక్షన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు బలంగా రాశారు. జునైద్ కుమార్ సంగీతం డ్రమ్స్ బీట్‌తో మంచి ఉత్సాహాన్ని ఇవ్వబోతోంది. ఈ గ్లింప్స్ లాంచ్ కూడా గ్రాండ్‌గా జరిగింది. 500కి పైగా డ్రమర్స్ కలిసి లైవ్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఆ ఈవెంట్ మొత్తం ఎనర్జీతో నిండిపోయింది. డెతడి ఒక కలర్‌ఫుల్, ఎనర్జీతో నిండిన సినిమా అవుతుందని అనిపిస్తోంది. త్వరలో "జాతర" ప్రారంభమవుతుందని మేకర్స్ చెప్పడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




## జాన్వీ.. టాలీవుడ్ లో ఇలా..

టాలీవుడ్ లో అతిలోక సుందరిగా చిరస్థాయిగా నిలిచిన శ్రీదేవి రేంజ్ కు ఆమె కుమార్తె, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ చేరుకుంటుందా? అనే చర్చ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు తెలుగు సహా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీని తన అందం, అభినయంతో శాసించిన శ్రీదేవి వారసత్వాన్ని జాన్వీ కపూర్ కొనసాగించగలదా అనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. శ్రీదేవి 1970లో మా నాన్న నిర్దోషి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, 1978లో వచ్చిన పదహారేళ్ల వయసుతో స్టార్ డమ్ అందుకున్నారు. అనంతరం ఆమె వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస విజయాలతో టాప్ ప్లేస్ లో నిలిచారు. తెలుగులో దాదాపు 100కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె.. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజాల సరసన సందడి చేశారు.

చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ సహా పలువురు సీనియర్ స్టార్ హీరోలతో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి, వేటగాడు, ప్రేమాభిషేకం, కార్తీక దీపం, క్షణం క్షణం వంటి చిత్రాలు ఆమెను టాప్ ప్లేస్ కు చేర్చాయి. ఇక ఇప్పుడు జాన్వీ కపూర్ తన కెరీర్‌ను అదే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ విషయంపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. బాలీవుడ్ లో ఇప్పటికే తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు టాలీవుడ్ పై పూర్తి దృష్టి సారించినట్లు అర్థమవుతోంది. తెలుగులో ఆమె తొలి చిత్రం దేవర కాగా.. అందులో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించి మంచి గుర్తింపు అందుకుంది. డెబ్యూతో హిట్ కూడా సాధించారు. ఇప్పుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది చిత్రంలో కూడా జాన్వీ హీరోయిన్ గా ఎంపిక కావడం విశేషం. దేవర షూటింగ్ లోనే ఆఫర్ రావడం గమనార్హం.పెద్ది మూవీ ఇప్పుడు విడుదలకు సిద్ధమవుతుండగా, టాలీవుడ్ లో ఆమెకు అవకాశాలు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. అయితే జాన్వీ కపూర్ భవిష్యత్తులో మరిన్ని పాన్ ఇండియా స్టార్ హీరోలతో పని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా అల్లు అర్జున్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో నటించాలని ఆమె ఆసక్తి చూపుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే అల్లు అర్జున్ తో ఓ ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయని, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రంలో జాన్వీ కనిపించనుందని టాక్ వినిపిస్తోంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613